కథ

# అతడు ఆమె ఒక స్వప్నలోకం

కాట్రగడ్డ దయానంద్

**అతడు ఆమె ఒక స్వప్న లోకం**
**మీరనుకున్నట్టు ఇది ప్రేమకథే!**

★★★

**చాలా రోజుల్నుంచి ఆ మార్గాన అతడు నడుచుకుంటూ వెళ్ళేవాడు. అప్పుడే విప్పారిన పొద్దు తిరుగుడు పూల యవ్వన ఛాయతో మిలమిల మెరిసే వాడు. యంత్ర శక్తికి ధీటు దారుఢ్యాన్ని బాహుబలాల్లో పొదువుకుని నడిచేవాడు. వేళకాని వేళల్లో హడావుడిగా నడుచుకుంటూ శ్రమే సర్వస్వమని సాగిపోయే వాడు. ఒక శ్రమ జీవన పరిమళాన్ని దిక్కులన్నిటికీ పంచుతూ ఒక యోధుడిలా కదిలేవాడు.**

అతడు అటుగా వెడుతుంటే ఆమె ఆదే మార్గాన ఇటువైపుగా–

వాన కురిసి వెలిశాక కర్రుతో కదిల్చిన నల్లరేగడి మన్నులా ఎంతో మృదువుగా, గొప్ప సారవంతంగా – తల నిండా తేనెటీగల గుంపును వలయాలు వలయాలుగా చుట్టుకొని నడుముదాకా తేనె ప్రవాహాన్ని హారంలా వేలాడేసుకుని కానరాని లోకాల చుట్టూ విహరించే కళ్ళతో గొప్ప అడవి పూల గుభాళింపును నడిచినంత మేరా వెదజల్లుతూ ఆమె–

చాలా రోజులు అతడటూ, ఆమె ఇటూ నడవటం అయ్యాక – వాళ్ళిద్దరూ బహువచనం నుంచి ఏక వచనానికి మారటానికి ముందు – ఒకానొక పొద్దుటిపూట, మంచు కురవటం వెలిశాక ఒకే వైపు వాళ్ళిద్దరూ –

పక్క పక్కనే గాని, దూరదూరంగా నడుస్తూ –

గుంపుగా ఎగుర్తున్న సీతాకోక చిలుకలు రెక్కల సౌందర్యాన్ని లోకం ముందు వెదజల్లారు.

సన్నటి చినుకులకు ముందు సాయం సమయాన నడుస్తూ తూనీగల సమూహాన్ని అట్లా ఆకాశంలోకి వాళ్ళిద్దరూ ఎగరేశారు. వాళ్ళిద్దరు నడిచినంతమేరా ఒక విరగబూచిన మోదుగుల వనాన్ని స్వప్నించుకుంటూ వెళ్ళారు. చివరకు వర్షంలో తడుచుకుంటూ ఒకరికొకరు సన్నిహితమై చేతులు చేతులు పట్టుకొని ఒక మహోజ్వల కాంతి తరంగ జలపాత హోరును వినిపిస్తూ వెళ్ళారు.

అతడామెకు శ్రమను వాగ్దానం చేసేడు. ఒక భద్రతను, ఒక విశ్వాసాన్ని తన నుంచి ఆమెకు ప్రసారం చేసేడు. ఆమె అతడికి తన స్వప్నాల్ని పరిచయం చేసింది. ఒక ఉజ్వల సౌందర్య భరిత భవిష్యత్తుని అతడి దోసిలి నిండా నింపింది. ఆమె అతడికి ఒక సప్త వర్ణ ఇంద్ర ధనుస్సును కానుకగా ఇస్తానంది.

ఒక సౌందర్యాన్ని, ఒక సంతోషాన్ని, ఒక ప్రవాహాన్ని, ఒక అనాది సంగీతాన్ని వాళ్ళిద్దరూ నడిచినంత మేరా లోకానికి పరిచయం చెయ్యాలనుకున్నారు.

***

మీరనుకున్నట్లు ఇది ప్రేమ కథే కదా!

***

కొన్ని వేకువ సౌందర్య వసంతాల తర్వాత, మరికొన్ని నడిజాము ఉగ్ర గ్రీష్మాల తర్వాత, మరిన్ని అపరాహ్నాపు వర్షగీతాలనంతరం, కొన్ని శీతల పవనాల నడిరేయిల తర్వాత,

కొన్ని ఆశల తర్వాత, కొన్ని నిరాశల తర్వాత, కొన్ని నిరీక్షణల అనంతరం –

అతడు ఆమెను మెల్లిగా నడిపిస్తుంటే, ఒక నిండు నదిలా, ఒక విరగబండిన వరిచేనులా ఆమె, అతడితో కల్సి నడుస్తూ ఒక సంతోషం – ఒక సాఫల్యం –

రాబోయే అతిథి కోసం వాళ్ళిద్దరూ కల్సి నాటిన వనాన్ని తృప్తి నిండిన కళ్ళతో వీక్షించేరు. కోయిల కూజితాలు పక్షుల కిలకిలరావాల సందడులు ఉడుతల కిచకిచలు సీతాకోక చిలుకల స్వేచ్ఛా విహారాలు తూనీగల ముఖ మిలమిలలు సమ్మోహ మిళిత వర్ణాల పుష్పాలు అన్నిట్నీ వనం నిండా చూచి ఆ శోభకు వాళ్ళే అచ్చెరువొందారు.

ఒకానొక శరదృతువులో చవితిరోజున నెలవంకలా వాళ్ళింటికొచ్చిన అతిథిని చూసి వనంలో విరగబండిన నారింజ రంగు సిగ్గుతో కుంచించుకుపోయింది. లేలేత చిగురు పెదాల్ని చూచి గులాబీల రెక్కలు చిన్న బోయాయి. నల్లనల్లని ముంగురుల్ని చూచి తుమ్మెదలే చాటుకు తప్పుకున్నాయి.

వాళ్ళిద్దరూ కల్సి గొప్ప సౌందర్య సృష్టిని చేశారు.

స్నానం చేయించి పెరటి వనంలో పడుకోబెట్టిన అతిథిని చూచి ఉడుతలు చెంతకు చేరి మృదువైన తోకల కుంచెలతో నేలను తట్టి త్వరత్వరగా ఆటలు నేర్పాలని ఉత్సాహ పడేవి. పిచ్చుకలు కిచకిచల్తో

పిల్ల పిచుకల నోటి ఎర్రదనాన్ని చూపిస్తూ త్వరత్వరగా అన్నప్రాసనకు సిద్ధం చేయటానికి ఆరాట పడేవి. తుమ్మెదలు ఝూంకారంతో మాటల్ని నేర్పటానికి తహతహలాడేవి. కోకిలలు త్వరత్వరగా పాటలు నేర్పాలని వనమంతా కలె తిరిగేవి.

ఇవన్నీ చూచి వాళ్ళిద్దరూ మురిసిపోయారు. తమ స్వప్నం సాకారమైందని సంతోషించారు. తమ స్వప్న లోకాన్ని తనివితీరా చూచుకునే వారు.

చవితి వెళ్ళింది. పంచమి వచ్చింది. మళ్ళీ చవితి..

స్వప్న లోకానికి ఆహారం తీసుకోవడం నేర్పించలేక పోయామని పిచ్చుకలు సిగ్గు పడి వెళ్ళిపోయాయి. ఆరుమాసాలు గడిచినా ఆట పాటలు ఊసే లేదని ఉడుతలు బాధతో ఉక్కిరి బిక్కిరయ్యాయి. గొంతులోంచి శబ్ద సౌందర్యాన్ని పలికించలేక పోయామని తుమ్మెదలు, పదాలు పాడించలేక పోయామని కోకిలలు మరో వనాన్ని వెదుక్కుంటూ వెళ్ళిపోయాయి.

దేనికీ స్పందించని స్వప్నలోకాన్ని చూచి, ఖాళీ అవుతున్న వనాన్ని చూచి వాళ్ళిద్దరూ కలత చెందారు. తల్లడిల్లి పోయారు.

ఏ భావమూ పలకని, ఏ స్పందనా లేని ప్వప్న లోకం – ఎలా పుట్టిందో అలాగే – ఆలోచనే లేనట్లు – పడుకో బెడితే పడుకోబెట్టినట్లుగానే – వెన్నంతా పక్కకే అతుక్కు పోయి ఏ స్వప్న తీరాల్లో దేవులాడి అలసిపోయినట్లు చూపులు – వాళ్ళిద్దరూ నివ్వెర పోయారు. నిస్సహాయం – నిస్సత్తువ – మళ్ళీ ప్రయాణం మొదలైంది.

రోజులకు రోజులు ప్రపంచమంతా చుట్టి వచ్చారు. స్వప్న లోకాన్ని అతడి భుజానికి కట్టుకున్నాడు. ఎన్నో. వనాల చుట్టూ తిరిగేరు. మూలికలు తినిపించేరు. లేపనాలు అద్దేరు.

వాళ్ళ ప్రయాణమంతటా ఈసారి చిదిమేసిన స్వప్నాల్ని చూచేరు. అయినా వాళ్ళు చెక్కు చెదర లేదు. ఛిద్రమైన స్వప్నాల గురించి పేదరాశి పెద్దమ్మలు చెప్పగా విన్నారు. అయినా బెదరలేదు. వాళ్ళ అన్వేషణ అనంతంగా కొనసాగించేరు.

ఒక మహత్తర సౌందర్య వనం కలత చెందింది.

ఎప్పుడన్నా ఏదన్నా మూలిక మహత్తుతో స్వప్న లోకం పెదాలు కదిలి నవ్వులు పూస్తే చాలు. వాళ్ళిద్దరితో పాటు ఆ వనమూ అబ్బుర పడేది. చెట్లు చెంగున తలలూపేవి. పూలు సౌగంధాన్ని పంచేవి.

ఏ ధన్వంతరి మహిమతోనైనా స్వప్నలోకం చప్పట్లు చరిస్తే చాలు తుమ్మెదలు కోయిలలు రహస్య జీవితాన్ని వదిలి బహిరంగ సమావేశాలు పెట్టేవి. సీతా





కోక చిలుకలు గాల్లో చిందులేసేవి. చిన్న చిన్న సంతోషాలకే ఉడుతలు ఇబ్బడి ముబ్బడిగా కాయల్ని కొరికి పిప్పి చేసేవి.

వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరు, స్వప్న లోకం కోసం వాళ్ళిద్దరూ–

ఎంతో శ్రమించేరు.

కరువుల్నీ కాటకాల్నీ వరదల్నీ వెల్లువల్నీ పట్టుదలగా ఎదుర్కొన్నారు. బతుకు సునామీలకు ఎదురీదేరు. వాళ్ళకు బతుకంతా స్వప్న లోకమే అయింది. పూలు పూయించాలని ఎన్నో వనాలని దేవులాడేరు. ఎన్నెన్నో మార్గాలవెంట తిరిగేరు. ఎన్నెన్నో అడ్డంకుల్ని అధిగమించేరు.

అతడి శ్రమ.... ఆమె పట్టుదల

వాళ్ళ స్వప్నలోకం అలాగే – వెల్లికిల్లా పడుకునే – ఇస్తేనే ఆహారం తీసుకోవటం – కూర్చో బెడితేనే కూర్చోవటం – ఇష్టమైతే వాళ్ళిద్దర్నీ చూచి గుర్తించినట్లు నవ్వటం –

రోజులు – నెలలు – సంవత్సరాలు – దశాబ్దాలు–

హఠాత్తుగా ఒకరోజు అతడు అలసిపోయానన్నాడు. ఇంతటి బరువునూ మోయలేనన్నాడు. ఈ అన్వేషణ తన వల్ల కాదన్నాడు. తనకిక విశ్రాంతి కావాలన్నాడు.

ఆమె నివ్వెరపోయింది. నిశ్చేష్టురాలైంది. తమాయించుకుని అంత త్వరగా అలసిపోతే ఎలా అని బుజ్జగించింది. మన బాసలు ఏం కావాలంది.

అతడు వంటి మీది పచ్చి గాయాలు చూయించేడు. కదుములు గట్టిన పాత గాయాల్ని చూడమన్నాడు. శ్రమనే కాదు ఇకదేన్నీ భరించలేనన్నాడు. నా గాయాలకు లేపనం అద్దే వాళ్ళెవరని ప్రశ్నించేడు.

మనముందున్నదే పెద్ద గాయం కదా అన్నదామె స్వప్నలోకాన్ని చూపిస్తూ. నీకు వంటి నిండా గాయాలు – నా మదిలోనూ గాయాలే కదా అందామె.

గాయం గాయం రాసుకుంది. మాటల కత్తులు విసురుకున్నారు. ఎవరి వేటకి బాగా గాయపడతారో ఒకరికొకరికి బాగా తెల్సు. ఆ ఆయుధాన్ని ప్రయోగించుకున్నారు.

ఎవరికి వారు నిస్తేజులయ్యారు. నిర్లిప్తులయ్యారు. బతుకు మీదే విరక్తులయ్యారు.

మోడు వారిన వనం సైతం తరలిపోయింది.

ఝుంకారాలు, సౌందర్యాలు, సంగీతం, గానాలూ, రెక్కలు, ఆకాశం కకావికలయ్యాయి.

చాన్నాళ్ళ తర్వాత వాళ్ళిద్దరూ ఒకరికొకరు బహు వచనమయ్యారు.

***

నిజంగా – నిజంగా ఇది ప్రేమ కథేనా!

***

అట్లా జరిగిన మూడో రోజునే –

ఎవరో కబురు పెట్టినట్లు ఆగమేఘాల మీద ఆ పిల్ల వాడొచ్చేడు. నూనూగు మీసాల యవ్వన కాంతిలో చక్రాల కుర్చీని నెట్టుకుంటూ వచ్చేడు. కాళ్ళ నుంచి నడుం దాకా క్షీణించిన కండరాలన్నీ శిలలా మారిన శాపగ్రస్త శరీరాన్ని మోసుకుంటూ వచ్చేడు. వస్తూ వస్తూ ఆ ఆవరణలోకి గొప్ప ఆశల్ని వెదజల్లుకుంటూ వచ్చేడు. ఎన్నెన్నో మోదుగు వనాలని చుట్ట బెట్టుకుని వస్తున్నానంటూ చెప్పేడు. మళ్ళీ ఏడాదికల్లా మహత్తున్న మందొకటి వస్తుందంటూ ఆ మందు అద్భుతాలు చేస్తుందని, తన మీద మందు జలం చల్లగానే తను మళ్ళీ ఆకాశంలో గాలి పటాన్నవుతానని చెప్పేడు. మళ్ళీ రెండేళ్ళ కల్లా స్వప్నలోకాన్ని కూడా తనతో చెయ్యి పట్టుకుని నడిపిస్తానని చెప్పేడు.

చెబుతూనే జేబుల్లోంచి ఏ కాలం నాటివో నాలుగు గోళీకాయలు తీసి గాల్లోకి ఎగరేసేడు. అవి సీతాకోక చిలకలై ఆ ఇల్లంతా స్వేచ్ఛగా తిరగసాగాయి. మరో జేబులోంచి ఎప్పటివో బాల్యం వాసన వేస్తున్న బచ్చాలాటలాడే ఓకులు బయటకు తీసి పెరట్లోకి విసిరేడు. ఒక విరగబూసిన వనం ప్రత్యక్షమైంది. తన కళ్ళల్లోంచి గుప్పెడు మినుగురుల్ని తీసి స్వప్న లోకమ్మీదకు అపురూపంగా వదిలేడు.

స్వప్నలోకంలో అనూహ్య స్పందన–

ఆ మినుగురుల కాంతికి స్వప్నలోకం పడీపడీ నవ్వింది. కేరింతలు కొట్టింది. టపటపమని కాళ్ళాడించింది. హాహ్హా అంటూ గొంతు విప్పింది. అట్లా వెల్లికిలా పడుకునే చేతుల్తో చప్పట్లు చరిచింది.

తుమ్మెదలు, కోకిలలు పాఠాలు చెప్పడానికొచ్చేయి. నాట్యం నేర్పే అవకాశం వస్తుందేమోనని ఈసారి నెమళ్ళు కూడా విచ్చేశాయి. ఉడుతలు ఉత్సాహంగా తోకల్ని నేలకేసి సున్నితంగా సుతిమెత్తగా తట్టేయి. తెల్లారే సరికల్లా తూనీగలు ఆకాశం నుండి భూమ్మీదకు ఒక నదిని మళ్ళించేయి.

మళ్ళీ ఏడాదికల్లా గాల్లో ఎగురుకుంటూ వస్తానంటూ వాడు చక్రాల కుర్చీ మీద మాయమైనాడు.

అలసిపోయిన వాళ్ళిద్దరూ స్థిమిత పడ్డారు. సిగ్గుపడ్డారు. ఒకరికొకరు చెంతన చేరేరు. ఓదార్చుకున్నారు.

స్వప్నలోకాన్ని భుజానేసుకుని వాళ్ళిద్దరూ మళ్ళీ ఒక సుదీర్ఘ ప్రయాణానికి సమాయత్తమయ్యారు.

మళ్ళీ వాళ్ళిప్పుడు ఏకవచనం.

***

మీరనుకున్నట్టూ నేననుకున్నట్టూ ఇది ముమ్మాటికీ ప్రేమ కథే కదా! వాళ్ళ ముగ్గుర్నీ మనం గుండెల్లో పొదువుకోవాల్సిందే కదా!

*


చిరునామా:

కాట్రగడ్డ దయానంద్,

పోస్టుమాస్టర్, హెడ్‌పోస్టాఫీసు,

బాపట్ల – 522 101, గుంటూరు జిల్లా

ఫోన్: 9490218383